బ్రహ్మ దర్శన భాగ్యంబు పడయగోరి
వెదుక పోవుదు వెచటికే వెళ్ళి మనస
అదియు నీలోన వున్నది గాంచు మచట
సత్యమును తెల్పు బాట యీసాయి మాట
ప్రేమ యను పంట పండింప నలవి కాదు
అంగడంచున జనిని అమ్మరాదు
ప్రభువులైనను సామాన్యప్రజలునైన
అహము విడనాడి త్యాగులై అరయవలయు

దివ్యాత్మ స్వరూపులారా!

కర్మక్షేత్రమున జీవయాత్ర సలిపే ప్రతి జీవికి మనస్సు వాక్కు చెవులు, కన్నులు, ముక్కు, కాళ్ళు, చేతులు యివన్నీ కూడను నిత్యోపయోగార్థమై ఏర్పడిన కరణములు. కరణములనగా పనిముట్లు. తన జీవయాత్రలో వుపయోగించుకునే కరణములు కనుకనే దీనికి ఉపకరణములని కూడను మరొక పేరు. ప్రాకృతమైన యీ జగత్తునందు యే విజయము సాధించవలెనన్నను కరణ, కారణ, కర్త యీ మూడు అత్యవసరము. ఈ కరణములు వుపయోగించుకునే వాడు కర్త. ఉపయోగింపబడేటువంటి వాడు కారకుడు. కారకుని యొక్క కోరిక కారణము. కరణ, కారణ, కర్త యీ మూడింటి యొక్క ఏకత్వాన్ని మానవుడు గుర్తించటమే మానవుని ప్రధాన లక్ష్యము. సామాన్యముగా కన్నులు చూస్తున్నవని, చెవులు వింటున్నవని, నోరు మాట్లాడుచున్నదని నిత్యజీవితములో మనము యీ పదములను వుపయోగపెడుతూ వుంటాము. కానీ చూచునదే కన్నులైన, మాటాడునదే నోరైన, వినునదే చెవులైన మానవుడు మరణించిన తరువాత యీ చెవులు, యీ కన్నులు, యీ నోరు వున్నవి కాని తమ తమ కర్మములను తాము ఆచరించటం లేదు. ఇవి కనుపించక, వినిపించక, పలుకక వుండినదానికి కారణము ఏమిటి? దీనిని పలికించే, వినుపించే, అనిపించే, తలపించేటువంటి ఒక శక్తి యిందులో యేదో ఒకటి అంతర్భూతమై వుంటున్నది మానవుని యందు. అది యీ దేహమునందు వుండినంత వరకే కన్నులు చూడగలుగుతున్నాయి, చెవులు వినగలుగుతున్నాయి, నోరు మాట్లాడ

గలుగుతున్నది, చేతులు పని చేయగలుగుతున్నాయి, కాళ్లు నడువగలుగుతున్నాయి. కనుక సమస్త కరణములకును ప్రాణము పోసి వాటివాటి కర్తవ్య కర్మలను ఆచరింపచేసేటువంటి దివ్యశక్తి మానవునియందు ఒకటి వున్నది.

దానినే సామాన్యముగా ప్రాణమని పిల్వగలుగుతున్నాము. ఐతే యీ ప్రాణము ఎక్కడనుండి వచ్చుచున్నది, ఎక్కడికి వెళ్లుచున్నది? ఎవరు పంపుచున్నారు? ఇదే కేనోపనిషత్తు వేసిన ప్రశ్న. ఈ పలికించే, వినిపించే అనిపించే, తలపించే, మరిపించే యీ దివ్యమైన శక్తి ప్రాణమునకు వున్నదా లేక ప్రాణముకంటె అధిపతియైన మరొక శక్తి యేదైనా వున్నదా అని విచారణ సలుపుతూ వచ్చింది. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. సూర్యుని యొక్క వెలుతురు ఆధారము చేతనే చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుని యొక్క ప్రకాశము భూమి పైన పడుచున్నది. అప్పుడు భూమి కూడను ప్రకాశిస్తూ వున్నది. ఐతే యీ భూమి దేనివల్ల ప్రకాశిస్తున్నది. చంద్రుని యొక్క ప్రకాశము చేతనే. చంద్రుడు దేనివల్ల ప్రకాశించుచున్నాడు. సూర్యుని యొక్క ప్రకాశము చేతనే. ఐతే సూర్యుడు దేనివల్ల ప్రకాశించుచున్నాడు.? అదియే దివ్యమైన శక్తి. దానిలో వుండిన హైడ్రోజన్, హీలియం అనేవి యే శక్తినుండి ఆవిర్భవించినట్టివి? దీనినే ఉపనిషత్తులు బ్రహ్మతత్వము అన్నారు. ఈ బ్రహ్మ యొక్క ప్రకాశము చేతనే జగత్తంతయు కూడను ప్రకాశించుచున్నదనియు కేవలము బ్రహ్మ ప్రకాశింపచేయునదే గాని బ్రహ్మను ప్రకాశింపచేసే వస్తువు జగత్తునందు లేదనియు ఈ బ్రహ్మ యొక్క ప్రకాశమే నేత్రములందు చేరి నేత్రములు చూడగలుగుచున్నవనియు, నేత్రములు చూడగలుగుతున్నవేగాని నేత్రములు బ్రహ్మను చూడలేకపోవుచున్నది. మనస్సు యీ ప్రకాశము యొక్క ఆధారమును పురస్కరించుకొని సంకల్పములను అభివృద్ధి గావించుకొనుచున్నదేగాని మనస్సు యీ బ్రహ్మను వర్ణించలేకపోతున్నది. కనుకనే ఉపనిషత్తులు యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహః' మనస్సునకుగాని వాక్కునకుగాని అతీతమైన దివ్యత్వము మానవునియందు ఇమిడి వున్నదని నిరూపిస్తూ వచ్చింది. కనుక మానవుని యందు ఇట్టి దివ్యమైన భవ్యమైన శక్తి ఇమిడి వుండియు మానవుడు దానిని గుర్తించుకొనలేకపోతున్నాడు. కారణము ఏమిటి? మానవుడు తన జీవితమందు బాహ్యదృష్టిని అభివృద్ధి పరచుకొనుటకు ప్రయత్నించుచున్నాడుగాని అంతర్దృష్టిని యేమాత్రము కూడను తాను ప్రయత్నించుకొని అనుభవించుటకు ప్రాకులాడుటంలేదు.

725059103

మానవుడు చక్కగా విచారణ సలిపిన, చిత్తశుద్ధి చేత యీ సత్య
మును గుర్తించుటకు సాధ్యమవుతుంది. ప్రతి మానవుడు తన యందున్న సమస్త
కరణములు వ్యాపింపజేసి, ప్రకటింపజేసి దానిని వికసింపజేసే శక్తి తనయం
దు వుండినప్పటికిని తాను కేవలము ఒక బలహీనుడుగను, అశక్తుడుగను
భావించుకొను చున్నాడు. ఇట్టి దివ్యమైన శక్తిని మానవుడు ఏవిధంగా విచారిం
చాలి. దీనినే కేనోపనిషత్ యీ విధమైన శక్తి మనస్సునకు మనస్సై, ప్రాణము
నకు ప్రాణమై, నేత్రమునకు నేత్రమై, శ్రోత్రమునకు శ్రోత్రమై, వాక్కునకు వాక్కై
అన్నింటిని కూడను అంతర్భూతముగా దానిని ప్రకాశింపజేయుచున్నది. కారు
లో లైటు వెలుగవలెనన్న, హారను శబ్దము చేయవలెనన్న లేక చక్రములు తిరుగ
వలెనన్న, మిషను నడువవలెనన్న దీనికి లోపలి కరెంటు అత్యవసరము. వెలిగే
లైటు, నడిచే చక్రములు, కదిలే యింజను, పలికే హారను యివన్నియు కరెం
టు మీద ఆధారపడివున్నవనే సత్యమును గుర్తించినప్పుడే మన యీ సర్వకరణ
ములు కూడా దివ్యమైన ఆత్మశక్తి చేత యివి తమ తమ ప్రభావము చేత తమ
తమ కర్తవ్యము నిర్వర్తించుచున్నవనే సత్యము మనకు అర్థమవుతుంది.
పూచిన పువ్వులన్నియు కాయలు కాయవు. కాచిన కాయలన్నీ పండ్లు కావు.
కాని పండిన పండ్లన్నీ క్రింద పడక తప్పదు. ఇదియే మానవత్వములో వుం
డిన ప్రధాన రహస్యము. కాల, కారణ, కర్తవ్యము ముగియగనే కాయము శక్తి
హీనమై, నిర్వీర్యమై, ప్రాణరహితమై, నిర్జీవమై నిల్చిపోతుంది. మరి యీ
జీవతత్వమునకు ఆధారమేమిటి? అదియే ఆత్మతత్వము. మానవుడు
యింద్రియములనే ప్రధానమైన దృష్టితో తాను విచారణ సలుపుతున్నాడు.
ఇంద్రియములకు అతీతమైన మనస్సు ఒకటి వుంటుంది. ఈ మనస్సునే
ఇంద్రుడు అని పిలుస్తూ వచ్చింది ఉపనిషత్తు. అనగా యింద్రియములకు
అధిపతియైన వాడు కనుక యితనికి ఇంద్రుడు అని మరొక పేరు. ఇంద్రుడ
నగా ఏలోవాలా మనస్సు. కనుక యింద్రియములను మనస్సునందు చేర్చి
మనస్సును ఆత్మయందు చేర్చినప్పుడే యీ మనో ఆత్మ సమ్మిళితమైన స్వరూప
ము దివ్యమైన శక్తి అని కేనోపనిషత్తు చెబుతూ వచ్చింది. కనుక యీనాటి మన
ఇంద్రియములను మనస్సునందు చేర్చటం లేదు. మనస్సును ఆత్మతో కూర్చటం
లేదు. మనస్సు ప్రాకృతమైన దానియందు ప్రవేశపెడుతున్నది. కనుక మనస్సు
వేరు ఆత్మ వేరుగా విభాగము సలుపుతున్నారు. మనస్సు యందు ఆత్మయందు
శరీరమునందు, యింద్రియములందు, అంతఃకరణము యందు అన్నింటి

T25059104

యందు సర్వవ్యాపకమై వుండిన చిచ్ఛక్తి అదే బ్రహ్మ తత్త్వము. సర్వత్రా నిండిన శక్తి ఒకటి వున్నది. ఇట్టి సర్వశక్తి మయమైన ఆత్మ తత్త్వము ప్రతి మానవుని యందు సూక్ష్మరూపములో నిల్చివుంటున్నది. అట్టి దివ్యమైన శక్తిని మానవుడు గుర్తించుకోలేక పోవటానికి కారణం ఏమిటి? శరీర మనో బలములను పురస్కరించుకొని, ధనకనక వస్తువాహనాదుల యొక్క బలమును పురస్కరించుకొని మానవుడు తనయొక్క తత్త్వాన్ని తాను మరచి భౌతికమైన లౌకికమైనటువంటి లోకమునే ఆధారముగా చేసుకొని అహంకార పడటం చేత యీ ఆత్మ తత్త్వమును విస్మరిస్తూ వున్నాడు.

ఇంద్రియములు ఒక్కొక్క సమయమునందు కేవలము దృశ్యములు మాత్రమే, ఇవన్నియు జడస్వరూపము ధరించినటువంటివే. ఈ పదార్థమును చూస్తున్నవి కన్నులు. ఇది కేవలము ఒక దృశ్యము. దీనిని చూచుచున్నప్పుడు కన్నులు ద్రష్ట. కాని యీ సమయములో ద్రష్టయైన కన్నులు మరొక సమయములోపల యివి కూడను దృశ్యములై పోతున్నాయి. ఏ విధంగా దృశ్యమవుతుందది? కన్నులు తెరచి వుండినప్పటికిని యీ మనసు ఎక్కడో సంచారము చేయుటంచేత ఎదుటనున్న వస్తువులు కూడను కన్నులు చూడలేక పోతున్నాయి. కాబట్టి ఆసమయమునందు కన్నులు దృశ్యమై పోతున్నాయి. మనస్సు ద్రష్టగా మారుతున్నది. మరొక సమయము లోపల మనస్సే దృశ్యమై పోతుంది. బుద్ధి ద్రష్టగా రూపొందుతుంది. విచారణా శక్తి లేని పరిస్థితి యందు మనసు దృశ్యమై పోతుంది బుద్ధి ద్రష్టగా మారుతుంది. విచారణా శక్తి లేని పరిస్థితి యందు మనసు దృశ్యమై పోతుంది బుద్ధి ద్రష్టగా మారుతుంది. అనగా నిద్రావస్థయందు మనస్సు లేదు. మనస్సు కేవలము ఒక దృశ్యముగా రూపొందుతుంది. కాని బుద్ధి కేవలము చైతన్యస్థితిలో వెలుగుతూ వున్నది. కనుక ఆసమయమునందు బుద్ధి ద్రష్ట మనస్సు దృశ్యము. సమాధి స్థితియందు బుద్ధి కూడను దృశ్యమై పోతుంది. ఆత్మ ద్రష్టగా మారుతుంది. కనుక అన్నింటికిని ఆత్మనే ద్రష్ట. ఈ మనస్సు యింద్రియములన్నీ దృశ్యములే. కనుకనే వీటన్నింటికిని కరణములని పేరుపెట్టారు. పనిముట్లు మాత్రమే. ఈ పనులు గావించేవాడు చేయించేవాడు ఒకద్రష్ట వుంటున్నాడు. ఆద్రష్టనే లేకపోతే పనిముట్లు ఎంత విలువైనవి అయినప్పటికిని అన్నికూడ నిరుపయోగమైనవిగా మారిపోతాయి. కొన్ని కోట్ల ధనమును వ్యయము చేసి ఒక పెద్ద మిషన్ తెచ్చిపెట్టారు. దాని విలువ గొప్పదే. కాని అందులో కరెంటు లేకపోతే నిరుపయోగమైన యినుప

725059105

ముద్దగా మారి పోతుంది. దేహము కూడను అటువంటిదే. ఇందులో దివ్యమైన చైతన్య శక్తి ఆత్మశక్తియే యిందులో సర్వకర్మలు పని చేయించకుండా నిల్చి పోయినప్పుడు యిది కూడను ఒక మాంసపు ముద్దగా తయారౌతుంది. ఇది ఒక తోలు తిత్తిగా రూపొందుతుంది. ఇలాంటి ఒక విలువలేని దేహమునకు విలువను కల్పించి దానియందున్న కరణములనంతా సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టి జీవిత మార్గములో వీటిని సరైన కరణములుగా సార్థకము గావించుకోటమే మానవుని యొక్క ప్రధాన కర్తవ్యము.

ఇతే మానవునకు యీ ప్రాకృతమైన భావము అంత సులభము గా మారేది కాదు.

పచ్చకర్పూరంబు పాది పాదు చేసి
కమ్మ కస్తూరి ఎరువుగా కుమ్మరించి
మంచి పన్నీరు పోసి పెంచుచున్న
వుజ్జగించునె తన కంపు వుల్లిపాయ

దాని వాసన ఎక్కడకు పోతుంది. పచ్చకర్పూరమే భూమి. కమ్మకస్తూరే ఎరువు పన్నీరే నీరు. ఇన్ని విధములైన దానితో యీ వుల్లిపాయను పెంచినప్పటికి వుల్లిపాయ వాసన యేనాటికి పోదు. అనేక జన్మలనుండి వెంటాడుచున్న యీ ప్రాకృతమైన భావములను ఎన్ని విధములైన సాధనలు సల్పినప్పటికిని, ఎన్ని రూపములైన సత్సంగములో చేరినప్పటికిని దాని యొక్క పాత వాసన యేమాత్రము అంత సులభంగా మారేది కాదు. కనుక మొట్టమొదట మానవుడు దేహసంబంధమైన విషయాన్ని చక్కగా అర్థం చేసుకోవాలి. ఈ దేహము ఏమిటి? మలమూత్ర దుర్గంధ మాంస రక్తములతో కూడినటువంటిదా! అవును మలమూత్ర దుర్గంధ మాంస రక్తములతో కూడినటువంటిదే. కాని అందులోనే మాణిక్యమనే ఆత్మతత్త్వము ప్రకాశిస్తున్నది. మాణిక్యములనేవి మానుల లోపల కాసే కాయలు కావు. మట్టిలో పుట్టేటువంటివే మాణిక్యములు. అవి మృణ్మయములైనప్పటికి చిన్మయముగా రూపొందుతాయి. నీ దేహము మృణ్మయమైనప్పటికి ఆత్మ చిన్మయముగా రూపొందుతుంది. ఈ చిన్మయ తత్వాన్ని చక్కగా అర్థము చేసుకొనుట [illegible] మానవునికి ప్రధానమైన రహస్యము. లేకపోతే జంతూనాం నరజన్మ దుర్లభమ్ ఈ నరజన్మము యొక్క దుర్లభము యేమిటి వుంటున్నది. ఈ విలువైన దానిని మనము గుర్తించినప్పుడే మన Value సరైన రీతిలో గుర్తించినవారమవుతాము. తన యందున్న విలువైన తత్వాన్ని తాను మరచిపోతున్నాడు. మాణిక్యము వంటి

తన హృదయాన్ని మసి బొగ్గులకు అమ్ముకుంటున్నాడు. కనుకనే తన విలువను తాను
గుర్తించుకోలేక పోతున్నాడు. మానవుని యొక్క విలువ ఏమిటంటే ఎవ్వరైనా ఒకరు
యాక్సిడెంటులో మరణించారంటే అతనికి ఐదు వేల రూపాయలు గవర్నమెంటు యి
స్తుండాది. వాని విలువ ఐదు వేల రూపాయలా? మానవుని జీవితము యింతేనా? ఇది
కాదు విలువ. దీనికి విలువయే లేదు. ఎంత విలువ యిచ్చినప్పటికిని చాలదు. అట్టి
విలువలేని పవిత్రమైన మానవుని విలువ నిమిత్తమై మనము విలువను దింపుతున్నాము.
ఒక్కొక్క సమయమనందు మనము చాలా భద్రమైన యినుప పెట్టెను తెచ్చి పెట్టుకుం
టాము యింటిలో. ఆ యినుప పెట్టె వెల తక్కువే. కాని యినుప పెట్టెలో పెట్టిన నగల
విలువ చాలా అధికమైనది.

విలువలేని యినుపపెట్టె యీ దేహము
పెట్టెలోన నగలు పెట్టినట్లు
దేహమందు దివ్య దేవుడుండెను సుమా.

ఈ దేహమనే యినుప పెట్టెలో దేవుడనే పెద్ద విలువైన నగ వుంటున్నది. దానికి మ
నము విలువ యివ్వాలిగాని యినుప పెట్టెకు కాదు. విలువ యివ్వవలసినది. విలువైన
ఆభరణములు విలువైన పెట్టెలోనే పెడితే రెండింటికి విలువవుండదు దొంగలు
దోచుకు పోతారు. కనుక యీ సుగుణములనే విలువైన ధనమును విలువలేని యి
నుపపెట్టెలో పెట్టాలి. ఇదియే సృష్టి యొక్క రహస్యము.

దేహము అనిత్యము. ఆత్మ సత్యము. సత్యమైన ఆత్మ కేవలము అని
త్యము, అశాశ్వతము అయినటువంటి దేహమునందు యిమిడి వుంటున్నది. దాని
నిమిత్తమై మనము దేహమును కాపాడుకొనవలెను. దేహమును అలక్ష్యము చేయ
రాదు. ఎంతవరకు? సత్యాన్ని మనం గుర్తించేంతవరకు దేహమును మనము పోషిం
చాలి. దేహమును మనము సంరక్షించుకోవాలి. అంతేగాని దేహమే ప్రధానముగా జీవిని
విస్మరించటము సరైన మానవత్వమునకు అర్థము కాదు. మనలో అహంకారము
చేరినప్పుడు అన్నియు మనకు మరుగైపోతూ వుంటాయి. ప్రకాశించే సూర్యునకు
దట్టమైన మేఘములు అడ్డువచ్చినప్పుడు సూర్యుడు కూడను మనకు కనుపిం
చడు. సూర్యుడు మనకు కనుపించకుండా పోయినంత మాత్రమున సూర్యుడు
లేడా? వున్నాడు. కాని మేఘములు అడ్డు రావటంచేతనే కనుపించటంలేదు.
ఐతే మేఘములు శాశ్వతమైనవా? కాదు. కాదు. కదలిపోయే మేఘములు. మేఘము
లు కదలిపోయిన తక్షణమే సూర్యుడు ప్రకాశిస్తాడు. మానవత్వములో యీ అహంకార
ము, అభిమానము అనే దట్టమైన మేఘములు చుట్టుకొనటంచేత ఆత్మతత్త్వమనేది

725059107

అర్థం కాక పోతున్నది. కదలించ లేక పోతున్నది. కనుపించక పోయినంత మాత్రమున లేదని మనము భ్రమిస్తున్నాము. 'దేవుడెక్కడటంచు దేవులాడగనేల' దేవుడు నీవే అయి వుంటున్నావు. నీవే ఆ స్వరూపమై నిన్ను నీవు వెతుక్కోటానికి ప్రయత్నిస్తున్నావు.

ఒక చిన్న ఉదాహరణము. సర్వపదార్థములు వున్న ఒక స్టోరు రూముకు పోయి మనము వెతుకుతూ వుంటే అన్ని పదార్థములు మనకు కనుపిస్తాయి. కాని ఒక్క పదార్థము మాత్రము కనుపించదు. ఏమిటది? పదార్థములను ఎవడూ వెతుకుతున్నాడో వాడు మాత్రం కనుపించడు ఇంక అన్ని కనుపిస్తాయి. కనుక యీ జగత్తనే స్టోరు రూములో నీవు ప్రవేశించి అన్నింటిని వెతుకుతున్నావు. అన్ని పదార్థములు కనుపిస్తున్నాయి. కాని నిన్ను నీవు చూడ లేక పోతున్నావు. అదే పెద్ద దోషము తనను తాను గుర్తించుకున్నవాడు సర్వపదార్థములను సులభముగా గుర్తించుకో గలడు. దృష్టి పదార్థములపై పెట్టటం చేతనే భ్రష్టమవుతూ పోతున్నాడు. టార్చి లైటు మనం వేసుకొని నడుచుకుంటూ పోతుంటాం. ఈ టార్చిలైటు దారిని చూపుతున్నది గాని నిన్ను చూపటం లేదు. టార్చిలైటు నీ వైపున మరల్చుకున్నప్పుడు. నీకు నీవే కనుపిస్తావు. ఇదియే దివ్యమైన దృష్టి. ఈ దివ్యదృష్టిని అంతర్ముఖముగా మార్చుకున్నప్పుడు ఆనందమయమైన, అమరమయమైన, ఆత్మతత్త్వము చక్కగా అర్థమవుతుంది ప్రకాశిస్తుంది.

ఒకానొక సమయమునందు దేవాసుర యుద్ధము జరిగినప్పుడు దేవతలకు విజయము సంభవించినదని విజయోత్సవము సలుపుచుంటున్నారు దేవతలు. ఈ విజయోత్సవము లోపల విజయమునకు కారణమును గుర్తించుకొన లేక నాకు విజయము సంభవించినది ప్రాప్తించినదని అహంకారముతో విర్రవీగుతున్నా వెర్రివారి వలె గంతులు వేస్తున్నారు. అహంకారములో విరవిహారము సలుపుతూ వచ్చారు. ఈ సత్యాన్ని గుర్తించిన బ్రహ్మ వారికి జ్ఞాననేత్రములు తెరిపించాలని సత్యప్రబోధలు సల్పాలని, ఆత్మానందము చేకూర్చాలని, యీ అంధకారమును దూరము గావించాలని సంకల్పించుకొని యక్షరూపమును ధరించి వారిముందు నిల్చాడు. ఈ అహంకారములో విరవిహారము జరుపుతున్న అగ్ని దేవుడు యక్షుని ముందు వచ్చాడు. అతనిని చూచి యక్షుడు, నాయనా! నీవెవరు? అని ప్రశ్నించాడు. ఓ వ్యక్తీ! నేనెవరో నీకు తెలియదా! నీకు తెలియక పోయినప్పుడు నేను చెబుతాను విను. సమస్త ప్రపంచమును క్షణములో భస్మము గావించే శక్తి కలిగిన మహావీరుడను నేను అగ్నిదేవుడను.. ఇనుము కాదు యింకేమైనా సరే ఒక్క క్షణములో

కరగింపచేసే శక్తి, భస్మము గావించే శక్తి నాలో వున్నది. అని అహంకారముతో విఱ్ఱవీగాడు. ఆ అహంకారము నిర్మూలము గావించాలని సంకల్పించుకున్న బ్రహ్మ చిన్న గరిక పోచను తన ముందు వేసి, 'ఓ అగ్నిదేవుడా! దీనిని కాల్చి చూస్తాను' అన్నాడు. ఇది ఎంతపనని అలక్ష్యముతో దానిని కాల్చటానికి ప్రయత్నించాడు. కాని ఎంత ప్రయత్నించినప్పటికిని ఆ గరిక పోచను యేమాత్రము కాల్చలేక పోయింది అగ్ని. తన యొక్క సర్వశక్తిని కూడను వుపయోగపెట్టాడు. కాని నిరుపయోగమై పోయింది. దానితో తలవంచుకుని వెళ్లాడు. వచ్చి, అయ్యా! నేను గాలి దేవుడను. నాయొక్క గాలి వీచినప్పుడు సముద్రములు పొంగి పోయి గ్రామములు, పట్టణములు, పల్లెలు గుట్టలు చెట్లు కూడను తలక్రిందుగా మార్చగలను. ఉప్పెన చేత ప్రపంచములో జరిగే ప్రమాదములు నీకు తెలియదా? ఇవన్నీ కూడను నా మహత్యమే. అని అనేక రకములుగా గర్వాన్ని తాను ప్రకటిస్తూ వచ్చాడు. ఓహో! అంతటి శక్తివంతుడవా. అయితే యీ గరిక పోచను కదిలించమని చెప్పాడు యక్షుడు. తన శక్తిని ప్రవేశపెట్టి ఎన్నివిధములతో తాను ప్రయత్నం సలిపాడు. కాని దానిని కదలించలేడు. ఇంతలోపల ఇంద్రుడు వచ్చాడు. ఇంద్రుడు వచ్చేటప్పటికి ఆస్థానమునందున్న యక్షుడు అంతర్ధానమయ్యాడు. ఆ స్థానములోపల ఒక స్త్రీ వచ్చి నిల్చింది. చూచాడు ఇంద్రుడు! తల్లీ మీరెవరు? ఇంతకు పూర్వము వుండిన వారెవరు?' అని ప్రశ్నించాడు. నా పేరు ఉమ. పూర్వము వున్నవాడు బ్రహ్మ. మీ అహంకారము మితిమీరి పోవటం చేత మీ అహంకారము నిర్మూలము గావించి కేవలము స్వస్వరూపమును దర్శింపచేసే నిమిత్తమై, మీకు సుజ్ఞానము బోధించే నిమిత్తమై అతను ప్రత్యక్షమయ్యాడు అహంకారముండినంత వరకు స్వస్వరూప దర్శనము ప్రాప్తించదు. కనుకనే యక్షరూపము ధరించాడు. యక్షరూపములో వున్న బ్రహ్మను కూడను మీరు బ్రహ్మగా భావించుకోలేక పోయారు. యీ నిప్పు, నీరు, గాలి యివన్నీ కలసి యింద్రియములతో సమానము. వీటన్నింటికి అధిపతియైన వాడవు నీవు. నీవు కూడను బ్రహ్మ దర్శనమునకు ఏమాత్రము అర్హుడవు కావు. కనుకనే ఆ బ్రహ్మ అంతర్ధానమై కేవలము నీవు యింద్రుడు కనుక నీవు వాంఛా స్వరూపుడుగా వుంటున్నావు. ఆ నీ వాంఛలను నిర్మూలముగావించే నిమిత్తము వాంఛా స్వరూపిణియైన స్త్రీగా నేను ప్రత్యక్షమయ్యాను. ఈ ప్రబోధల చేత యీ దేవతలు తమ తమ అహంకారమును కొంతవరకు నిర్మూలము గావించుకొని కన్నులు తెరచి జ్ఞానోదయము కలిగి బ్రహ్మను గురించి ప్రార్థిస్తూ వచ్చారు. దేవతలకు యింత శక్తి వుండినప్పటికిని ఒక గరిక పోచను కదలించలేక పోయారు. ఇలాంటి శక్తి ఎక్కడనుంచి వుంటుం

ది. మానవుని యందు వుండినప్పటికిని యీ అహంకార మమకారములు అనేవి అన్నింటిని కప్పిపుచ్చి తన స్వస్వరూపమును కప్పిపుచ్చుచున్నది. అప్పుడు ఇంద్రుడే తలవంచి

- కదలదు నీదు సంకల్పము లేనిది గడ్డిపోచయును
అడియు నిదియునన నగవేల
పిపీలకాది బ్రహ్మపర్యంతము నీవే
అది ఎరుంగరు మదిగలంగరు
భువిని కొందరు వివేకమున వర్తించెదరని కడు
విఱ్ఱవీగెదరు గాని
చివరకే వేళ ఏమి సంభవించునో తెలియజాలరు.
ఎంతవారలైనా.

ఓ భగవంతుడా! ఎన్ని తెలివితేటలు వుండి ప్రయోజనము ఏమిటి? ఎన్ని శక్తిసామర్థ్యములుండి ప్రయోజనము ఏమిటి? ఎంతటి విద్యావంతులై వుండి ప్రయోజనము ఏమిటి? ఎంతటి ధనకనక వస్తువాహనాదులతో వుండి ప్రయోజనము ఏమిటి? ఎంత ధన బలము, భుజ బలము, బుద్ధి బలము వుండినప్పటికి నిన్ను తెలుసుకొనే బలము లేనప్పుడు సర్వబలము కూడను దుర్బలములే అన్నారు. నిన్ను తెలుసుకొనుటకు ప్రేమబలమొక్కటే తప్ప ఇంకే బలము నిన్ను తెలుసుకొనుటకు సాధ్యము కాదన్నారు. ఆ భక్తిబలమునకు మించిన బలము మరొకటి లేదు. భక్తి అనగా ఏమిటి? భగవంతుని నిస్వార్థమైన హృదయముతో నిర్మలమైన భావముతో, నిరహంకారమైన చిత్తముతో ప్రేమించుటయే భక్తి.. కనుక మానవుని యొక్క శక్తిసామర్థ్యములు ఇంద్రియములందు యేమాత్రము లేదు. ఆ ఇంద్రియములు బ్రహ్మబలము చేతనే తమ తమ పనులు తాము చేస్తున్నాయి. మన ఇంద్రియములన్నియు కరణములనే సత్యాన్ని గుర్తించండి. పనిముట్లు అని భావించండి. మనము కర్తగా మారి వాటిని సద్వినియోగం గావించుకునే దిశలో ప్రవేశపెట్టండి.

ఈ పనిముట్లకు కొన్ని కొన్ని సమయముల లోపల కొన్ని రకములైన రోగములు ఏర్పడుతూ వుంటాయి. ఈ పనిముట్లకు వచ్చే రోగము ఏమిటి? ఒక గడ్డపార వుంటుంటాది. ఇది ఒక పనిముట్టే. కాని దానిని వుపయోగపెట్టి వుపయోగపెట్టి మొద్దుబారిపోయి వుంటుంది. ఆ మొద్దుబారటమే దీనికి రోగము. దానిని తిరిగి అగ్నిలో వేసి, సుత్తితో కొట్టి దానిని చక్కగా సూటిగా

725059110

మార్చుకోవాలి. ఈ యొక్క రోగమునకు యీ విధమైన ఔషధమే దానికి సరియైన ఔ
షధము. అదే విధముగనే మన కన్నులుంటున్నాయి. కన్నులకు కూడా ఒక రో
గము వుంటున్నది. కన్నులు ఆరోగ్యంగా వుంటున్నప్పుడు తెలుపు తెలుపు. నలు
పు నలుపు, ఎరుపు ఎరుపు, పసుపు పసుపు కనుపిస్తుంది. కానీ జాండిస్
వచ్చిందంటే అంతా పచ్చగా కనుపిస్తుంది. అది ప్రకృతి దోషమా? కాదు.
కాదు. ఇంద్రియ దోషము. మన నాలుక ఆరోగ్యముగా వుండినంత వరకు
తీపి తీపి, కారము కారము, చేదు చేదుగా కనుపిస్తుంది. కాని మలేరియా
వచ్చిందంటే అన్ని తీపులు కూడను చేదుగా రూపొందుతాయి. కాబట్టి యీ
ఇంద్రియములంతా రోగాలతో కూడినటువంటివి. కానీ యోగముతో కూడినది
కాదు. వీటినన్నింటిని మనము అరికట్టుకున్నప్పుడు గొప్పయోగంగా రూపొం
దుతాయి. అదే 'యోగః చిత్తవృత్తి నిరోధకః' పతంజలి సూత్రము. మన ఇం
ద్రియములను మొట్టమొదట కంట్రోలులో పెట్టుకోవాలి. మానవులు పుట్టుకొన్ని
దినమునుంచి ఇంద్రియాలను ప్రవేశపెట్టకూడదు. దానికి తగిన శాంతమును
బోధించాలి. కాలము తీసుకోవాలి. నిత్యానిత్య విషయ పరిశీలన చెయ్యాలి.
తదుపరి యీ ఇంద్రియములను ప్రవేశపెట్టాలి. అప్పుడే సరియైన రీతిలో
వినియోగము జరుపుకున్నవారము వుతాము.

విద్యార్థులారా! ఈ వయస్సులోపల విద్యార్థుల ఇంద్రియములు
మహా సూటిగా ధాటిగా వుండేటువంటివి. ఘాటుగా కూడా వుండేటువంటివి.
మానవుని కన్నులు మహా పావనమైనవి. ఎప్పుడూ చూచినా వారిని వీరిని చూ
స్తూ వుంటాయి. దీనివలనే ఎక్కువ పాపాన్ని అభివృద్ధి పరచుకుంటున్నాయి.
కన్నులనిచ్చినది ఎందుకు? అన్నీ చూడటానికా. కాని మంచిని చూడు, చెడ్డనెం
దుకు చూస్తావు? నోరు యిచ్చినది తినే కోసమే. కాని గడ్డిని తింటావా? ఫలము
ను తింటావా? మంచి పదార్థమును మనము అనుభవించాలి. కనుక ప్రతి
ఇంద్రియమును సన్మార్గములో ప్రవేశపెట్టాలి. మనము చేసే సమయంలో
యీ బాధ ఏమాత్రము తెలియదు. కానీ దీని ఫలితము మున్ముందు అనుభ
వించక తప్పదు. చెడ్డ దృష్టిని కంట్రోలులో పెట్టుకోండి. చెడ్డ మాటలను
కంట్రోలులో పెట్టుకోండి. చెడ్డ శ్రవణాన్ని కంట్రోలులో పెట్టుకోండి. చెడ్డ
thoughts control లో పెట్టుకోండి. చెడ్డ పనులను కంట్రోలులో పెట్టుకోం
డి. ఇదే నిజమైన ఆధ్యాత్మికము. దీనిని పురస్కరించుకొనియే

See no evil see what is good.
Hear no evil hear what is good
think no evil think what is good.
talk no evil talk what is good.
do no evil do what is good.
This is the way to God.

ఈ విధముగా తగిన రీతిలో మనము సాధించినప్పుడు మున్ముందు దాని బాధలకు, ఎన్ని కష్టములను అనుభవించవలసి వస్తుంది. యవ్వనము చాలా అహంకారముతో కూడినది. అందులో మానవుని యవ్వనము క్షణభంగురమైనది. మించువలె మించి పోతుంది. త్వరగా దాటి పోతుంది. కాని యిట్టి క్షణభంగురమైన యింద్రియముల వాంఛలకు యవ్వనమునకు మనము మురిసి పోయి భవిష్యత్తును మనము భస్మము చేసుకుంటున్నాము. ఈ సమయము లోపలే తగిన అదుపులో పెట్టుకోటానికి తగిన కృషి చెయ్యాలి. ఇదియే కేనోపనిషత్తు ఋషులకు గాని, దేవతలకు గాని, మానవులకు గాని ప్రబోధించిన సద్బోధ.

ఇంతేకాదు దేవతలకు మానవులకు సరైన ఆదర్శమును నిరూపిస్తూ వచ్చింది. ఓ మానవుడా! నీవు చేసే పాప ఫలము గాని పుణ్య ఫలముగాని గోవు పాలు పిండిన తక్షణమే పాలు యిచ్చేది కాదిది. నాటిన విత్తనము వంటిది. యిది అన్నారు. విత్తనము నాటిన తక్షణమే వృక్షమై ఫలములు మనకందించదు వృక్షము కావటానికి కాలము తీసుకుంటుంది. కొన్ని సంవత్సరములు తీసుకుంటుంది. తదుపరి కాయలు కాసినప్పుడు కొన్ని నెలలు తీసుకుంటుంది. కాయలు ఫలములు కావటానికి కొన్ని దినములు తీసుకుంటుంది. కాబట్టి యిది దీర్ఘకాలముతో కూడినది. జాగ్రత్తగా నీవు తెలుసు. ఈ నాడు నీవు పాపము చేసిన తక్షణమే నాకేమి ఫలము వచ్చింది నాకేమి రాలేదే అని విఱ్ఱవీగవచ్చు. కాని యీ విత్తనమంతా ఫలమై పోయి యీ ఫలమును నీవు అనుభవించటానికి టైము తీసుకుంటుంది. ఇది మాత్రము తప్పినది కాదు. తప్పునది కాదు. కనుక జాగ్రత్తగా మనము యీ బాల్య వయస్సులో పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టుకోవాలి. దీనిని పురస్కరించుకొనియే

Start early
Drive slowly
Reach safely.

మనము యీ వయస్సునందే ప్రయత్న పూర్వకంగా సాధించాలి.

వాక్కు యొక్క తత్వాన్ని మనము గుర్తించుకోవాలి. వాక్కు చాలా పవిత్రమైనది. జయదేవుడు చెప్పాడు

జిహ్వే రసజ్ఞే మధురప్రియత్వాం
సత్యం హితం త్వాం పరమం వదామి
ఆవర్ణయేథా మధురాక్షరాణి
....

అరుచి ఎరిగిన నాలుకా! అపవిత్రమైన నాలుకా! దివ్యమైన వాక్కులతో కూడిన నాలుకా! వాణిశ్రేణి అభివృద్ధి పరచే నాలుకా! సరస్వతీ స్వరూపమైన నాలుకా! నీవు యింత పవిత్రమైన నాలుకవు ఇంత అపవిత్రమైన మాటలు వుపయోగ పెడుతున్నావు ఇది నీకు మంచిది కాదు. దీని పాప పరిహారము నిమిత్తమై గోవింద దామోదర మాధవేతి అని స్మరణ చేయమని చెప్పాడు. ఎంత త్యాగము నాలుకకు. ఎంతటి గౌరవము నాలుకకు. ఎంతటి మర్యాద నాలుకకు. ఎంతటి విశాలము నాలుకకు. దీనిని చక్కగా మనము విచారించాలి. నాలుక ఒక ఫలమును భుజించటానికి ప్రయత్నించినప్పుడు అది పుల్లగా వుంటే యిది జఠరాగ్నికి పంపటం న్యాయం కాదు. జఠరాగ్ని ఏది

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.

భగవంతుడు వైశ్వానర రూపంలో వుంటున్నాడు. భగవంతునికి నైవేద్యము చేయవలసిన ఫలము కాదు యిది. ఇది మధురమైన ఫలము కాదు. అని ఆ ఫలమును ఓ భూదేవతా నీవే దానిని సృష్టించావు దానిని నీవే అందుకొమ్మని వుమ్మి వేస్తుంది. అదే ఫలము మధురంగా వుంటుంటే ఓ మధురమైన మాధవా యీ మాధుర్యాన్ని నీవు అనుభవించు. మధురాధిపతే మధురం మధురం. తాను యే మాత్రము అనుభవించదు. మంచిని భగవంతునికి యిస్తుంది. చెడును ప్రకృతికి విసిరి వేస్తుంది. ఇంత త్యాగము కలిగినది యీ నాలుక. ఎంత ఓపిక. ఏమిటి ఆ ఓపిక. సూటియైన అంబులవంటి ముప్పైరెండు దంతములు వుండగా దీని మధ్య మెత్తని నాలుక ఎంత చక్కగా జాగ్రత్తగా మెలగుతుంది. దీనిని విభీషణుడు కూడా చెప్పాడు హనుమంతుని దగ్గర. హనుమంతా! రాక్షసుల వంటి యీ దంతముల మధ్య నేను నామమును స్మరించే నాలుక వలె జీవిస్తున్నాను. ఏ కించిత్తు నేను అటుయిటూ అజాగ్రత్త పడినా యీ దంతముల మధ్య నా జీవితము నాశనమై పోతుంది. కనుక యీ నాశనము కాక

పూర్వము నామాన్ని స్మరిస్తున్నాను, రూపాన్ని కూడను దర్శింప చేయమని చెప్పి హను
మంతుని ప్రార్థించాడు. అప్పుడు హనుమంతుడు చెప్పాడు. విభీషణా! నీవు
కేవలము నాలుకగాను యీ రాక్షసులు దంతములుగాను పోల్చుకుంటున్నావు. నిజ
మగాని దంతములు ముందురాలతాయా నాలుక ముందు రాలుతుందా? దంత
ములు ముందు రాలిపోతాయి. నీవు భయపడనక్కర లేదు. నాలుక ఎప్పటికి
రాలదు. నీవు నాలుక వంటివాడవు. నీవు రామసన్నిధి చేరుతావు. ఈ రాక్షసులనే
దంతములు ముందుగానే కూలిపోతాయి. యోచించనక్కర లేదని ధైర్యము
చెప్పాడు.. నాలుక యింత పవిత్రమైనది. యింత సున్నితమైనది. ఇంతేకాదు
గౌరవమును అందుకొనేటువంటిది: ఏమిటి యీ గౌరవము. ఈ నాలుక బజా
రు కుక్కలవలె ఆ యింటికి యీ యింటికి తిరిగేది కాదు. తన యింటిలోపల
లోన వుండి తలుపుల బయటకు కూడా రాదు. అంత గౌరవముగా జీవిస్తుండాది.
చూశారా! ఎన్ని మాటలో మాట్లాడుతుంది కాని ఒక్కతూరి తలుపు దాటి బయ
టకేమైనా వస్తుందా? రాదు. ఇది చాలా గౌరవంగానే, మర్యాదగానే రాణివలె జీవిస్తూ
వుంటున్నది. కనుకనే నాలుకను చాలా గౌరవము నందిస్తున్నారు. ఇంతేకాదు లోక
ములో యేమైనా చెడ్డ పనులు చేసినప్పుడు ఛీ! పశువా అని లోకనిందూషిస్తుం
ది. మంచి పని చేసినప్పుడు ఆహా! నీవు పశుపతివంటి వాడవని వర్ణిస్తుంది.
కనుక దూషణకు భూషణకు గౌరవాన్ని అందించేది నాలుకే. అట్టి పవిత్రమైన నాలు
కను మనము పవిత్రమైన దాంట్లోనే ప్రవేశపెట్టాలి. ఇవియు ఉపనిషద్వాక్యములు
ఎంత సులభమైన వాక్యములు. ఎంత సున్నితమైన వాక్యములు. ఎంత మధురమై
న వాక్యములు. ఇంత మంచి వాక్యములు కలిగిన వుపనిషత్తులను మనము యీ
నాడు విస్మరిస్తున్నాము. సర్వవేదసారము ఉపనిషత్తు. ఈ ఉపనిషత్తులయొక్క
తత్వము అర్థము చేసుకొనుటకు ఎవరు ప్రయత్నించటం లేదు. ఇంత చిన్న
చిన్న మాటల చేతనే మానవుని అనారోగ్యమును దూరము గావిస్తున్నది. మాన
వుని అజ్ఞానము దూరము గావిస్తున్నది. ప్రజ్ఞాన జ్యోతిని ప్రకటింప చేస్తున్నది.
ఇలాంటి విషయములోపల విద్యార్థులు చాలా జాగ్రత్త వహించి యీ వయస్సు
నుండి పవిత్రమైన జీవితమును గడపటానికి తగిన కృషి చేయాలి.
ఈ విద్యతో బాటు వినయమును కూడను మనము పోషించుకో
వాలి. ఈ వినయము లేక విద్యయొక్క విలువ కేవలము నిరుపయోగమై పోతుంది.
తల్లి తండ్రులను గౌరవించండి. గురువులను గౌరవించండి. పెద్దలను గౌర
వించండి. చిన్నలను ప్రేమించండి. ఈ విధమైన మార్గము లోపల అధికభాష

కట్టి పెట్టండి.

అతిగ భాషించు మూర్ఖత్వ మధికమయ్యె
కార్య శూరత్వ మ్మక్షీణించి కరగిపోయె
బ్రతుకు ఆడంబరాలతో భారమాయె
నేటి విద్యార్థి బ్రతుకు కోపటిదాయె.

ఆడంబరముల చేతనే విద్యార్థి బ్రతుకంతా బజార్లో పడిపోతుండాది. ఆడంబరములకు ఏ మాత్రము అవకాశము నందించరాదు. ఎల్లా వుంటుండాలి.

మేఘములు మింటిపై చేరి మెదలుచుండ
వాటి దాపున విద్యుత్తు వెలయునట్లు
విద్యవెనుకను జ్ఞానంబు వెలయవలయు

నల్లటి మేఘముల మధ్య మెరుపు ఏ విధంగా కదలుతూ వుంటుందో ప్రకాశిస్తూ వుంటుందో అదే విధముగా అంధకారమైన యీ జగత్తునందు మన విద్య విద్యుల్లేఖ వలె వెలగాలి. కేవలము bookish knowledge ని మనము పెట్టుకొని వాదోపవాదములలో దిగకూడదు. వాదము విద్యకు చాలా విరోధము. ఏమీ తెలియని వాడే వాదమునకు పూనుకొనటము. అన్ని తెలిసినవాడు నిశ్శబ్దంగా వుంటాడు. ఏమీ లేని ఆకు ఎగిరెగిరి దుముకుతుంది. అన్నీ వడ్డించిన ఆకు అణిగిమణిగి వుంటుంది. కనుక మనము అన్ని వడ్డించుకున్న పూర్ణమైన వ్యక్తివలె ప్రకాశించాలి. ఇదే విద్యార్థుల భవిష్యత్తుకు సరైన రాజమార్గము.

ఈ వయస్సులో మనకు అహంకారము, అభిమానము, ఆడంబరము అనేవి అమితంగా వుంటాయి. ఇవి ఆహార విహారముల యొక్క దోషము. తోని ఆ దోషములను కొంచెం పరిహారము గావించుకొని రావాలి. మనము దోషులు కాకూడదు. పవిత్రులు కావాలి. అదియే నిజమైన ఆదర్శము యీనాటి లోకమునకు అవసరము. విద్యార్థి లోకము యేరీతిగా వుంటుండాదంటే బయటప్రపంచములో చూచినప్పుడు భయంకరముగా వుంటుండాది. మన విద్యార్థులు అభయ స్వరూపులుగా రూపొందాలి. భయపడే వారికి అభయము నందించాలి. మన ప్రేమ తత్వము తో అందరిని ఆకర్షించుకోవాలి. ఏ విధంగా? Magnet యినుమును ఆకర్షిస్తుందో ఆవిధంగా జగత్తునంతా, సమాజమునంతా ఆకర్షింప చేసుకోవాలి. అందరితో కలిసి మెలిసి మెలగాలి. దీనినే వేదము నందు చెప్పిన శ్లోకము

సహనావవతు సహనౌ భునక్తు

సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై.

ఈ శ్లోకమునకు అర్థం ఏమిటి? కలసిమెలసి తిరగాలి. కలసి మెలసి పెరగాలి. కలసి మెలసి తెలుసుకున్న తెలివిని పోషించాలి. కలసిమెలసి కలత లేక కలిమిలో జీవించాలి. ఇదియే లోకమునకు శాంతి శాంతి శాంతి. కనుక లోకశాంతి మనకు కావాలనుకున్నప్పుడు అందరితోనూ కలసిమెలసి కలత లేక కలిమిలో జీవించాలి. కలతలు వుండరాదు.

ఈ ఉపనిషత్తు భావములు ఎంత పవిత్రమైనవో మీరు ఒకతూరి విచారించాలి. ఆనాటి ఋషులు తెలివితేటలు లేనివారు కాదు. వారు ఈనాటి సైంటిస్టులకంటె ఎక్కువ పరిశోధనలు చేసినవారే. వారు చేసిన పరిశోధనలు ఈనాటి వ్యక్తులయొక్క ఒక భాగమైనా లేదు. జీవితములో పరిశోధనలు చేస్తూ వచ్చారు.. ఈనాటి సైంటిస్టులు చీకటి రూములో కూర్చుని పరిశోధనలు చేస్తున్నారు. ఈనాటి పరిశోధనలు కేవలము బావిలో కప్పలవంటివి. ఆనాటి పరిశోధనలు సముద్రములో వున్న కప్ప సంచారముగా జరిగింది. విశాలమైన పరిశోధనలు చేస్తూ వచ్చారు. ఈనాడు స్వార్థము స్వప్రయోజనములతో కూడిన పరిశోధనలు. అవి నిస్స్వార్థము, నిరహంకారములో కూడిన పరిశోధనలు. ఈనాడు ఋషులను మనము హాస్యాస్పదముగా పనికిరాని వారివలె మనము భావిస్తూ వస్తున్నాము. ఇది కాదు. వారు ప్రసాదించిన దివ్యమైన మణులే ఈనాటి మానవత్వాన్ని పోషిస్తూ వస్తున్నాయి. కనుక శాస్త్రములు మథించి అందించిన సుధానిధులు ఈ ఉపనిషత్తులు. కనుక ఉపనిషత్తుల భావాలు చిన్న-చిన్న విషయములతో మీ నిత్య జీవితములో అవసరమైన మార్గములలో ప్రవేశపెట్టి మీ జీవితాన్ని అనుభవించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

రేపటి దినము మరొక ఉపనిషత్తును తీసుకుందాం. ఈ సర్వోపనిషత్తులు భగవంతుని సమీపానికి చేర్చేటువంటివే. ఉప-సమీప. భగవంతుని సమీపానికి చేర్చేటువంటివే. అదే మొట్టమొదట మన వైస్ చాన్సలర్ కోరారు. భగవంతుని సమీపానికి పోయే వుపాయములు చెప్పమని అడిగాడు. కనుక భగవన్నామస్మరణ గావిస్తూ దివ్యమైన జీవితాన్ని పవిత్ర మార్గములో ప్రవేశపెట్టి ప్రశాంతమైన జీవితమును మనము ఆదర్శంగా అందించాలి. లోకములో అల్లర్లు అధికమైపోయాయి. అశాంతి మితిమీరిపోయింది. భద్రత తగ్గిపోయింది.

725059116

ఇలాంటి సమయంలో విద్యార్థులు ఆదర్శవంతమైన అభయాన్ని ఆనందమును భద్రతను చేకూర్చాలని నేను ఆశిస్తున్నాను.